(ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీలో బహుమతి పొందినది)

# గోరంత దీపం

జోరున వర్షం కురుస్తోంది.

ఆకాశమంతా నల్లని మబ్బులతో నిండి వుంది.

చిక్కటి చీకటి అలముకుపోయింది.

'అమావాస్య ముసురు' అని పొద్దునే అనిపించింది, శివయ్యకి. ఉదయాన్నే మొదలెట్టిన ముసురు యిప్పటికి మరీ ఎక్కువైంది.

వాన-మన్నునీ మిన్నునీ ఏకం చేస్తోంది.

పాత నవారు మంచం బిగదీసుకుపోయి కడపరాయిలా వున్నట్లనిపించింది శివయ్యకి. వొళ్ళంతా నొప్పులు పుడుతున్నై. పక్కకి వొత్తిగిల్లేడు.

టపటపా నీళ్ళు పడినై -ముడుచుకున్న మోకాలిమీద.

చూరు వంగిపోయిన పాత పెంకుటిల్లు. కప్పులో చిల్లులు బాగానే పడినై. పెంకు నేయించాలని చాలా రోజులుగా అనుకుంటూనే వున్నాడు. జయమ్మతో అన్నాడు కూడా. 'ఆఁ మన కొంప కురిసేంత వాన పడేడిస్తేగా' అని తన అర్జీని పక్కకి నెట్టేసింది, ఆమె. తను ఊరుకున్నాడు.

అవును-జయ-తన అర్జీలని ప్రక్కకి నెట్టేసినా, తన సలహాలని విని ఉదాసీనంగా ఊరుకోవడం అలవాటు చేసుకున్నాడు.

తానిలా నలుగురూ అనుకునేటట్లు-'జయ చేతిలో కీలుబొమ్మ'గా

ఎందుకు మారేనా అని విశ్లేషించుకున్న రోజులూ లేకపోలేదు. లభించిన సమాధానం వొక్కటే!

అది తనకు ఆమె మీది ప్రేమ. ఆ ప్రేమలో ప్రత్యేకత ఏమిటంటే అది జాలితో వచ్చిన ప్రేమ!

అవును. ఆ జాలే-ఆమెను తాను ప్రేమించేటట్లు చేసింది; ఆ జాలే ఆమెను తాను గౌరవించేటట్లు చేసింది; ఆ జాలే ఆమెను తాను లాలించేటట్లు చేసింది. చివరికి ఆ జాలే ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా తాను 'సరే' అనేటట్లు చేసింది. అందుకే ఆమె ఏమన్నా సరే తను ఊరికే వూరుకోవడం అలవాటు చేసుకున్నాడు!

జయపట్ల తనకు కలిగిన జాలికి కారణం చాలా చిత్రమైనది! సవతి తల్లి పెంపకంలో చిన్నప్పుడు-పెళ్ళి ముందే ఆమె కోరంటికాన్ని అనుభవించడం తనకు బాగా సన్నిహితంగా తెలుసు. ఆమెను ఆ బాధల నుంచీ విముక్తురాల్ని చేయాలనే తాపత్రయంతో-తన తండ్రి-పెళ్ళి ప్రసక్తి తెచ్చేడు. అప్పుడు ఆయనా మరింత ఉదారంగా, జాలిగా ఆమె గురించి తనకు చెప్పేడు. అసలే, ఆమె పరిస్థితులు తెలిసిన తాను-కళ్ళు చెమర్చుకున్నాడు. పెళ్ళి జరిగిపోయింది.

భార్యగా జయ-తనకు అరచేతిలో నిమ్మపండులా మారింది. పసిపిల్లను చూసుకున్నట్లు చూసుకున్నాడు. స్కూల్ టీచర్‌గా వచ్చే ఆదాయంలోనే ఆమెను అరటిచెట్టులా పోషించుకున్నాడు.

తన జాలినీ, గారాన్నీ అందిపుచ్చుకుని, తన మీద అన్నిహక్కులూ కల్పించుకుంది జయ. తాను ముచ్చట పడ్డాడు. ఆ తర్వాత, ఆమె తెలివితేటలకీ, సంసార నిర్వహణపట్ల శ్రద్ధకీ మురిసిపోయాడు. ఆమెను స్నేహితురాలిగా, ఒజ్జగా అంగీకరించాడు. ఆ తర్వాతనే ఆమె తనకు అధికారిగా మారింది. ముగ్గురు పిల్లల తల్లికి ఆ మాత్రం చొరవ, అధికారం తప్పేం

కాదని సరిపెట్టుకున్నాడు.

బొమ్మ తాళ్ళు తన చేతిలోని వ్రేళ్ళకు చుట్టుకున్న తర్వాత-జయ-వాటిని బిగించినా, వదులుచేయకపోయినా: "కానీలే, దాన్నొక మాట అని బాధపెట్టడమెందుకు" అని పూరుకున్నాడు.

అప్పుడప్పుడూ, ఆమె నిర్ణయం తనకేమాత్రం రుచించకపోయినా -'తాను మాత్రం బాధ్యతతోనే గదా ఇలా చేస్తోంది, పోనీలే' అని తృప్తి పడి విట్టూర్చేడు.

చంద్రంకి-తను-నాన్న పేరు పెట్టుకుంటానంటే, 'తొలిచూలుకి మా నాన్న పేరు' అంది. సరే అన్నాడు.

ఇంటర్లో-వాడికి లెక్కలు రావు, ఆ గ్రూప్ వద్దంటే-"కాదు, వాడు ఇంజనీరు కావాలి: అదే తీసుకుని చదవాల్సిందే" అంది. తాను ఈ కొట్టి పూరుకున్నాడు.

"ఉన్న ఇల్లు చాల్లే మనకు. ఇప్పుడు అప్పుచేసి పెంకు నేయించడం ఎందుకూ" అంటే. "కాదు. ఈ యిల్లు మరీ గుడిసెలా తయారైంది. పర్వాలేదు. డబ్బు సంగతి నేను చూసుకుంటాగా, వచ్చే జీతం నాకిచ్చి మీరు హాయిగా మీ పాఠాలు చూసుకోండి" అంది. తాను అలాగే చేశాడు.

"మూడో నలుసు కూడా మగపిల్లవాడే పుట్టాడు. కొన్నాళ్ళు ఆగుదాం" అంటే "వీల్లేదు నాలుగోది ఆడపిల్ల అని ఎక్కడన్నా రాసిపెట్టి వుందా ఏం" అని మూతి ముప్పై వంకర్లు తిప్పి తనను హాస్పిటల్ కి తీసుకెళ్ళింది. తాను వెళ్ళాడు.

అవును. తాను, అన్నిటా ఆమె మాటనీ, చేతనూ అనుసరించాడు.

స్కూల్స్ ఇన్స్పెక్టరయ్యాడు.

పిల్లలు ఎక్కొచ్చేరు. పెద్దవాడు ఇంజనీరింగ్ పూర్తి చేస్తాడు-ఈ ఏడాది చివరకు, రెండోవాడు-సూరి-ఎమ్మేలో వున్నాడు, తిరుపతిలో మూడు -విశ్వం-తిరుపతిలోనే బి.కాం.లో వున్నాడు. నాలుగు నెలల క్రితం రిటైరయినాడు తాను.

నమ్మి చెడింది లేదన్నట్టు-జయమ్మ చెప్పినట్టు నడుచుకున్నందువల్ల నష్టమేమీ కలుగలేదు.

ఆ మాటకొస్తే, తానేనాడూ అలాంటి భావననిగానీ, ఊహనిగానీ తన దగ్గరికి రానీలేదు.

అయితే-

ఇవ్వాళ యిన్ని ఆలోచనల్లకూ కారణం మరో విధంగా వుంది!

మంచంలో పక్కకి మసిలేడు, శివయ్య.

వాన కురుస్తూనే వుంది.

ఉదయం నుంచీ జరిగినగాథ అంతా తలుపు కొచ్చింది, ఆయనకు.

నరనరాల్లో వొక్కసారిగా ఆ ఘటన తాలూకు పులుపుదనం వ్యాపించింది!

తనలో తను తర్జన భర్జన చేసుకున్నాడు నిజానికి.ఆ తర్వాత చాలాసేపు తటపటాయించాడు. అసలీ అనుమానాలన్నీ ఎందుకు-మానేద్దాంలే అనీ అనుకున్నాడు, ఒక దశలో.

కానీ,

ప్రభావతి రాసిన వుత్తరం-తనని నోరూ వాయీ కట్టేసుకుని, చేతులు ముడుచుకూర్చో నివ్వలేదు. ఎంతోసేపు వితర్కించుకుని అడిగేశాడు.

సగం మాట బయటికి రాకుండానే, గయ్యిన లేచింది, జయమ్మ. "రెండొందలు పెట్టుకుని మీరు గుంటూరు పోయిరావాల్సినంత అవసరమేం వుందిప్పుడు. అఖ్ఖర్లేదు" అంటూ తీర్మానం చేసేసింది.

ప్రభావతి సంగతి చెప్దామా అనిపించింది, అప్పుడు తనకు. కానీ చెప్పలేదు. గుంటూరులో వున్న ముసలి అవ్వని చూసివస్తానని అడిగితేనే కొట్టిపారేసిన మనిషి-ప్రభావతి విషయాన్ని అసలు వోపిగ్గా వినైనా వినగలదా అనే అనుమానం కలిగింది.

తను గునిసేడు, విసుక్కున్నాడు, చీదరించుకున్నాడు, చిరాకుపడ్డాడు.

తన అవస్థ అంతా చూస్తూ, గమనిస్తూ, పరీక్షిస్తూవుంది, జయమ్మ. ఏమీ మారలేదు. ఆమె పట్టు సడలలేదు.

మధ్యాహ్న భోజనాన్ని వో గంట వాయిదా వేశాడు. జయమ్మ ఉలకాలేదు, పలకాలేదు. దొడ్డి గుమ్మంలో కూర్చుని బాదం ఆకుల విస్తళ్ళు కుడుతూ కూర్చుంది.

ఒంటి గంట కావస్తోంది. చంద్రం వచ్చాడు.

తన మనస్సులో ఆశారేఖ తోచింది.

వాడు సిఫారసు చేస్తే తన పని సానుకూలం కావచ్చు.

కిమిన్నాస్తిగా భోజనం కానిచ్చాడు.

చంద్రాన్ని వసారాలో కూర్చోబెట్టుకుని, పరామర్శలూ, కుశల ప్రశ్నలూ పూర్తిచేశాడు. ఆ తర్వాత నెమ్మదిగా మనసులో మాటని బయట పెట్టాడు. "మా అవ్వకి బాగా లేదుట్రా చంద్రం. బతికినంతకాలం బతకదు, ముసల్ది. ఒక్కసారిపోయి చూస్తానంటే వీల్లేదంటోంది, మీ అమ్మ." నువ్వు చెప్పి చూడమన్న అభ్యర్థన చెప్పక చెప్పినట్లు ధ్వనిస్తూనే వుంది.

-కొంగు పరచుకుని కునుకు తీస్తున్న తల్లి పక్కగా కూర్చున్నాడు, చంద్రం.

"పోనీలే, పెద్దావిణ్ణి చూసొస్తానంటున్నాడు. వెళ్ళిరానీ అమ్మా" అని సర్ది చెప్పబోయాడు.

నెమ్మదిగా కళ్ళు తెరిచి కొడుకు వైపు చూసింది, జయమ్మ. ఆ

చూపుల్లో చాలా ప్రశ్నలు దట్టించి వున్నై. వాటిని చదువుకునే గ్రహింపు, గ్రాయకం వున్నై చంద్రానికి.

తలవంచుకుని, నేలమీద గీతలు గీయసాగేరు. మౌనం రాజ్యమేలు తోంది.

పక్కకి తిరిగి వడుకుంటూ అన్నది జయమ్మ-"నీకు డబ్బిచ్చి పంప వద్దన్రా చెప్పొద్దున."

సమాధానం అర్థమైంది చంద్రంకి.

ముందు వాకిలి దగ్గర నిలబడ్డ శివయ్య-చంద్రంకేసి చూసి, వసారా లోకి కదిలేడు.

వసారాలో మంచంమీద పడుకుని అనేక రకాలైన ఆలోచనల్ని తరుమసాగేడు, శివయ్య.

వాతావరణం ముసురుగా వుంది. శివయ్యకూ మనసంతా ముసురు పట్టింది.

ఏమీ పాలుపోవడంలేదు ఆయనకు. లేచి, పైపంచె బుజాన్నవేసు కుని రీడింగ్ రూమ్‌దాకా వెళ్లేడు! ఏవేవో పేపర్లు తిరగేశాడు. ప్రెసిడెంట్ సూర్నారాయణ వున్నాడేమోనని వెళ్తే, ఆయన హైదరాబాద్ కి పోయాడని చెప్పేరు. వెనక్కి తిరిగి కాళ్ళీడ్చుకుంటూ యింటి కొచ్చేడు. ఇంట్లోకాళ్ళు గాలిన పిల్లిలా కాస్సేపు తిరిగేడు.

అలిసిపోయినట్లనిపించింది. పడక్కుర్చీలో కూర్చున్నాడు.

అప్పటికి వర్షం మొదలైంది. చూరులో నుంచీజారే వానచినుకుల్ని గమనిస్తూ, ఆలోచనలు చేస్తూ అలా కూర్చున్నాడు.

కాఫీ తెచ్చియిచ్చింది, జయమ్మ. చురుగ్గా చూస్తూ గ్లాసుని అందు కున్నాడు.

"అంతగా ఆలోచనా అక్కర్లేదు. బాధపడకండి" అంటూ లోప

లికి నడిచింది జయమ్మ.

పుండుమీద కారం జల్లినట్లనిపించింది, శివయ్యకి. కాఫీ గ్లాసు చేత పుచ్చుకునే ఆమె వెంట లోపలికి వెళ్ళి—వంటగది గుమ్మం మీద కూర్చు న్నాడు. ఆ పక్కగా చంద్రం కాఫీ తాగుతున్నాడు.

"ఏటికో కోటికో నా కోరికని వొక్కసారన్నా తీరిస్తే ఏం?" కష్టం గానే అన్నాడు.

విని వూరుకుంది.

చాలా సేపు ఏవేవో చెప్పేడు, విస్తారాలాడేడు; వాదనలోకి లాగా లని గాలమేశాడు.

తలచుకుంటే తనకే ఆశ్చర్యం వేస్తుంది, అంత ధీమాగా, సూటిగా, వేడిగా—తను ఆమెతో అలా మాట్లాడటం ఇదే మొదటిసారి. ఈ తెగింపుకి కారణం? బహుశా-ప్రభావతి వుత్తరంలోని అంశాలు అయివుండాలి.

తానెన్ని మాట్లాడినా-జయమ్మ బెల్లం కొట్టిన రాయిలా వుండిపో యింది! తాను వోటమిని అంగీకరించక తప్పలేదు.

మంచంలో లేచి కూర్చున్నాడు, శివయ్య.

"టైమెంతరా చంద్రం?" అడిగేడు.

"పది దాటింది"-జయమ్మ సమాధానం చెప్పింది. ఆ వెంటనే, "వాడు నిద్రపోయాడు" అన్నది.

"నిద్రపట్టించుకోండి.ఎక్కువ సేపు మేలుకుని ఆలోచిస్తూ కూర్చుంటే మీ ఆరోగ్యం పాడవుతుంది." సలహా యిచ్చింది. ఆమె స్వరంలో చక్కెర కలిసింది.

ముభావంగా వూరుకున్నాడు శివయ్య.

బయట కాలవల్లో-కప్పలు బెక బెకలాడుతున్నై. వాన శబ్దం ఎక్కువైంది. గాలి వీస్తోంది.

లేచి కిటికీ దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు.

దూరంగా చింతచెట్లూ, తుమ్మచెట్లూ చిటారు కొమ్మల్ని వూపుతూ వింత నృత్యాలు చేస్తున్నై.గాలి పాటలు పాడుతూ, ఆడుకుంటూపోతుంది, పొలాల మీదుగా.

చల్లని గాలీ, తుంపరా-మొహానికి తగిలి దూసుకుపోతున్నై. పెరట్లో మందారచెట్టు దిగంబరంగా స్నానం చేస్తోంది. గడ్డివాములు తడిసిన ఏనుగుల్లా నిలబడివున్నై.

జయమ్మ లేచి శివయ్య దగ్గరగా వచ్చింది.

ఆయన బుజాన చేయివేసింది. వెనక్కి తిరిగి చూశాడు. "పదండి. చలిగాలికి ఇక్కడ నిలబడితే మీకు పడదు." లాలనగా అంది.

శివయ్య కరిగిపోయాడు.

వెనక్కి తిరిగి నడిచేడు.కిటికీ రెక్కమూసి తనూ వెనక్కివచ్చింది జయమ్మ.

"పడుకోండి. పొద్దున్న మాట్లాడుకుందాం" అంటూ ఆయన్ని మంచం మీద పడుకోబెట్టి దుప్పటి కప్పి: తాను తన మంచం మీదికి వెళ్ళింది.

ఎంతగా ప్రయత్నించినా నిద్రపట్టలేదు, శివయ్యకు. ప్రభావతి ఉత్తరమే సలుపసాగింది. ఆ ఆలోచనతోనే తెల్లవారింది ఆయనకు.

అటు వాన వెలిసింది; ఇటు వూరు మేలుకొంది.

చకచకా పనిపాటలు కానిచ్చుకుని, కాఫీలు పూర్తిచేసింది జయమ్మ.

ఎండ కరకరలాడుతూ వచ్చేసింది.

ఊళ్ళోకి వెళ్ళాడు శివయ్య.

విశ్వేశ్వరాలయానికిపోయి, దైవదర్శనం చేసుకుని, అక్కణ్ణుంచీ రీడింగ్ రూమ్‌లో కొంతసేపు గడిపి నెమ్మదిగా ఇంటికి తిరిగి రావడం ఆయన దినచర్యలో ఉదయపు ప్రకరణం.

శివయ్య ఇంటికి తిరిగి వచ్చేసరికి, ఆయనకోసం ఎదురు చూస్తూ కూర్చుంది, జయమ్మ. చంద్రం భోజనం అయిపోయింది.

భార్యా భర్తలిద్దరూ అన్నాలకి కూర్చున్నారు.

మాటల ప్రసక్తిలో చెప్పింది జయమ్మ, "నేనీపూట తిరుపతి పోయొస్తా"నని.

"అదేం?" అన్నట్టు చూశాడు శివయ్య. "పిల్లల్నిద్దర్నీ చూసి రేపు సాయంకాలానికి తిరిగొస్తా" నంటూ భోజనం ముగించింది. వాళ్ళిద్దరూ తిరుపతిలో హాస్టల్లో వుంటారు. ఈమె అప్పుడప్పుడూ వెళ్ళి రావడం మామూలే. పచ్చళ్ళూ, ఫలహారాలూ అందచేసి వస్తూ వుంటుంది.

శివయ్య మౌనంగా వూరుకున్నాడు.

మధ్యాహ్నం రైల్లో తిరుపతికి బయల్దేరింది జయమ్మ, గంటప్రయాణం.

-రైల్లో కూర్చున్న జయమ్మ మనస్సు వెచ్చగా వుంది.ముళ్ళగోరింట విచ్చుకున్నట్లు వుంది. భర్త నిన్నల్లా చేసిన గొడవని గుర్తు చేసుకుని హాయిగా నవ్వుకుంది. శివయ్య తత్వం, తన తరహా బేరీజు వేసుకుంది. తమ మనస్తత్వాలూ, వాటివలన వుత్పన్నమైన చిన్నచిన్న కలహాలూ, అభిప్రాయభేదాలూ అన్నీ గుర్తుకు రాసాగేయి.

ఇన్స్పెక్టర్ అయిన తర్వాత, ఆయన రాజుపాళెం కేంప్ వేసుకున్నప్పుడల్లా, ఆ సంగతి తనకు చెప్తూ, తన కళ్ళల్లోకి సూటిగా చూడలేక—చిత్రమైన భావ సంఘర్షణకి లోనవుతూ వుండేవాడు ఆయన. తనకా విషయం ఎక్కడ తెలుస్తుందో అన్నరీతిలో సందేహపు దృక్కుల్తోమసలుకుంటూ వుండేవాడు.

అయినా, ఆయన పిచ్చిగానీ-తనకి తెలియకపోతేగదా ఆ వాస్తవం!! వాళ్ళ నాన్నగారి ద్వారా తనకు ఎప్పుడో తెలుసు. రాజుపాళెంలో వీళ్ళ

దూరపు బంధువు వొకావిడ వుండేది. ఆమెకు చిన్నప్పుడు ఈయనిచ్చి పెళ్ళి చేయాలనుకున్నారట. కానీ, ఏ కారణానో అది పొసగలేదట.

రాజుపాళెం వెళ్ళి వచ్చినప్పుడల్లా-"మీరేమైనా ఆమె ఇంటికి వెళ్ళి వచ్చారా?" అని తానేమైనా ఆరాతీస్తుందేమోనని బెరుకు బెరుగ్గా తిరిగేవాడు. ఇంతా చేస్తే-ఆయనకంత తెగింపూ, చొరవా లేవనీ, వెళ్ళలేడని తనకు తెలియక పోతేకదా? అయినా, ఆమె వేరే మనువాడి సంసారాన్ని దిద్దుకుంటుంటే-ఈయన వెళ్ళి చుట్టపు చూపుగానైనా పలకరించి వస్తే తప్పేమిటి? అంత మాత్రానికే తాను అపార్థాలు కల్పించుకుంటుందా? ఏం మనిషో?

చిత్రమైన దోబూచులాటగా వుండేది-ఇద్దరి పరిస్థితీ-ఈ వ్యవహారంలో.

ఆయనేమో, తనకు ఆమె గురించి ఏమీ తెలియదని అనుకోవడం; తెలిస్తే బాధపడతాననో! బాధ పెడతాననో భావించడం.

తానేమో అన్నీ తెలిసీ, ఏమీ తెలియని దానిలా ఉదాసీనంగా, మౌనంగా, మూగగా తిరుగుతూ వుండటం.

ఇరవై ఏళ్ళు ఇలాగే గడిచినై.

ఇన్నాళ్ళకి-ఆమె పిల్ల—ప్రభావతి—ఈయనగారికి ఉత్తరం రాయడం. "అమ్మ పోయింది. నాకు నా అన్నవారెవరూ లేరు. కాలేజీలో చదువుతున్నాను. మనకు కావలసిన వాళ్ళు ఈయన వున్నారని, మీ అడ్రస్ మా అమ్మ చెప్పింది. కష్టాల్లో వున్నాను.కాలేజీ ఫీజులకి వో రెండొందలు సర్దమని" వేడుకుంటూ రాసింది.

ఆ ఉత్తరాన్ని పట్టుకుని, లోపలికీ వెలిపలికీగా, కాలుగాలినపిల్లిలా పిన్నల్లా ఎంత బాధపడ్డారు. తనకు చెప్పాలంటే భయం; చెప్పకపోతే పని జరగదు. ఏదో సాకుతో డబ్బు తీసుకువెళ్ళి ప్రభావతికి సహాయం చేయా

లనే కోరిక; సత్సంకల్పం.

తానేనా అంత తెలివి తక్కువది?

-మళ్ళీ మరోసారి హాయిగా నవ్వుకుంది, జయమ్మ.గుండె నిండుగా ఊపిరి పీల్చుకుంది. పరిగెత్తుతున్న రైల్లో నుంచీ, కిటికీ బయటికి చేతి రుమాలుని ఊపుతూ గాలితో ఆడుకుంది.

ఎదురుగా కూర్చున్న మనుషులు తన చర్యలకి నవ్వుకుంటున్నారే మోననే సందేహం వచ్చి, అదాటున చుట్టూ కలయజూసింది.ఎవరి పనుల్లో వాళ్ళున్నారు! "హమ్మయ్య" అనుకుని తనలో తానే నవ్వుకుంది.

భర్త తత్వానికి ఆమెకు లోలోపల ఆనందమే కలిగింది. అవును. ఆయనది పసిపిల్లవాడితత్వం. కనుకనే తను ఎలా చేస్తే అలా నడిచాడు. ఆ మాటకొస్తే,తాను మాత్రం ఆయన్ని ఏంబాధపెట్టింది కనుక?ఏంచేసినా, తనూ తమ కుటుంబ భవిష్యత్తు కోసమే చేసింది. తన ప్రయత్నానికి ఆయన సహకరించాడు-అంతేగదా?

జయమ్మ కళ్ళు చెమర్చినై. గత అనుభవాలు ఆమె మనస్సును ఉద్విగ్నం చేశాయి. తన నిర్ణయం ఎప్పుడూ సరియైన దారినే వెళ్తుందనే విశ్వాసం ఆమెది. ఆ విశ్వాసంతోనే ఈ ప్రయాణమూ పెట్టుకున్నది.

రైలు పరిగెడుతూనే వుంది.

జయమ్మకు కునుకు పట్టింది.

* * *

మర్నాడు సాయంత్రం, కనిచీకటి వేళకి;

అనుకున్నట్టే ఇంటికి తిరిగొచ్చింది జయమ్మ.

పెరటి గేటు తీసుకుని లోపలికి వస్తున్న జయమ్మనూ, జయమ్మ

వెనగ్గా వస్తున్న యువతినీ-ఆశ్చర్యంగా చూడసాగేరు-వసారాలో చదరంగం ఆడుకుంటున్న-శివయ్య, చంద్రం.

లోపలికొచ్చి, తేరిపార చూస్తున్న భర్తకి సమాధాన మిచ్చింది జయమ్మ: "ఇదిగో-మీ ప్రభావతి, అవును. నే వెళ్ళింది ఈ పిల్లని తీసుకు రావడానికే, అమ్మాయింక మనతో యిక్కడే వుంటుంది. కూతురనుకుంటాను నేను; మీరేమో కోడలనుకోండి."

గలగలా మాట్లాడేస్తున్న జయమ్మ మాటలు-తండ్రీ కొడుకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేసినై!

ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ వెన్నెల పరుచుకుంది! ఆ వెన్నెల్లో పావురాలు ఆడుకోవడానికి వచ్చాయి!!